


"దయచేసి వినండి."

దయచేసి విందామని నిక్కబొడుచుకొన్నాయ్ చెవులు.

ఒకటి కాదు

రెండు కాదు

వందలు. వందల చెవులు.

"మద్రాసు నుండి హైద్రాబాద్ వెళ్ళు ఎక్స్‌ప్రెస్ సుమారు తొంభై నిముషములు ఆలశ్యముగా నడుచుచున్నది" ఆడా, మగా కాని గొంతుతో రైల్వే అనౌన్స్‌మెంట్.

నిక్కబొడుచుకొన్న చెవులు క్రమంగా వాలిపోయాయి.

వెయిటింగ్‌రూం గోడమీద దక్షిణ మధ్య రైల్వేవారి ప్రకటన "ప్రజల సేవలో భారత రైల్వేలు."

అవును!

ప్రజల సేవలో భారత రైల్వేలు 90 నిముషాలు లేటు

కాదు కాదు. మన రైళ్ళు నడుస్తాయి కనుక ప్రజల సేవలో భారత రైల్వేలు 90 యుగాల

లేటు.

ప్లాట్ ఫాంమీద జనం

గుంపులు గుంపులుగా జనం

పట్టు చీరెలు, సిల్కు చీరెలు, షిఫాన్, నైలెక్స్‌లు, సీతాకోక చిలుకల కోకలు, బెల్ బాటమ్స్ లంగాలు, లుంగీలు—

పరుగెడుతున్నాయ్

జిగ్ జాగ్ బల్లుల్లా.

ప్లాట్ ఫాంమీద జనం

గుంపులు గుంపులుగా జనం

ఎగుమతి కావడానికి

ఎగుమతి చెయ్యడాని

దిగుమతి చేసుకోవడానికి

జనం జనం

గుంపులు గుంపులుగా జనం

నేను ఎగుమతి కావడానికి కాదు

దిగుమతి చేసుకోవడానికి కాదు

ఎగుమతి చెయ్యడానికి

అనంతను పురిటికి పుట్టింటికి పంపడానికి.

వెయిట్, వెయిట్, వెయిట్!

ఇంకా రెండు గంటలు.

"కూర్చుందాం పదండి."

"పద."

ప్లాట్ ఫాం చివర సిమెంటు బెంచి.

ఆ సిమెంటు బెంచి మా జ్ఞాపకాల కేంద్రం. అనుభూతుల నిలయం.

దూరంగా రైల్వే క్వార్టర్స్ మీదుగా, కొబ్బరి ఈనెల మధ్యగా చందమామ. ఆకాశం తెల్లగా వెన్నెల సున్నం వేసినట్లు.

ఎండలో ముత్యాలారబోసినట్లు వెన్నెల్లో ఆకాశం నిండా నక్షత్రాలు.

గగనం యవ్వనం బుగ్గమీద దంతక్షతాల్లా నక్షత్రాలు. కనుచూపు మేరా రైలుపట్టాలు సమాంతర రజిత ప్రవాహాలు.

అనంతా నేను పెళ్ళి చేసుకోక ముందు యిక్కడే కూర్చొని కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. పరస్పరం కళ్ళలోకి చూసుకొంటో; భవిష్యత్తు కలలు కంటో;

మొదటిసారి అనంత చేతిని నా చేతిలోకి తీసుకొన్నదీ; ఆమె వ్రేళ్ళు నా జుట్టుతో ఆడుకొన్నదీ—ఇదిగో—ఈ చోటే. అందుకే ఇది మా జ్ఞాపకాల కేంద్రం. అనుభూతుల నిలయం.

అనంత పరిచయం కాకముందూ ఆ తర్వాతా రమణా నేను అనేక సాయంకాలాలు యిక్కడే కూర్చునేవాళ్ళం. నేటి సాహిత్య ధోరణులు, ప్రపంచ రాజకీయాలు మొదలుకొని రాంబాబు కవిత్వం వరకు మా కబుర్లలో దొర్లి పోయేవి.

"యిదీ మన చోటు. యిక్కడ కూర్చుందాం."

అనంతా నేనూ ఆ చివరి బెంచిమీద కూర్చున్నాం.

"ఏం మనిషివో బాబు! ఇంత సెంటిమెంటు వుండకూడదు."

"యాంటీ సెంటిమెంట్ కూడా ఒక సెంటిమెంటే. బ్లయిండ్ సెంటిమెంట్స్ పనికిరావని, మనిషికి ఆనందాన్నిచ్చేవి, ఆ ఆనందాన్ని అభివృద్ధిపరిచేవి అయిన సెంటిమెంట్సు వుండి తీరాలన్నాడు రస్సెల్ తెలుసా?"

"నీతోనా? ఎప్పుడు?"

"ఆయనెవరితోనో చెప్పాడు. వాళ్ళు మనతో అన్నారు సరేనా!"

అనంత చిన్నగా నవ్వింది. ఆమె నవ్వితే వెన్నెల నవ్వినట్లుంటుంది.

తెల్లని శరీరానికి ఎర్రని చీరె, జాకెట్టు చాల అందంగా వున్నాయి. తెల్లని నుదుటిమీద ఎర్రని బొట్టు వుదయిస్తున్న సూర్యుడిలా వుంది.


ఈ రాత్రి గగనంమీద, అనంత అధరం మీద మెరుస్తూ ద్విపాత్రాభినయం చేస్తున్నాయి నక్షత్రాలు.

అనంత చేతిని తీసుకొని గాజులు లెక్కపెడుతున్నాను. ప్రతి మూడు ఎర్రగాజుల నడుమ రెండు తెల్లగాజులు. మొత్తం పదమూడు గాజులు.

"మీరూ వస్తే బావుండేది", అనంత కళ్ళు నిండా దిగులు.

"వస్తాను నిన్ను తీసుకురావడానికి."

"ఎప్పుడు? మూడు మాసాల తర్వాతా?"




ఫలితం పక్క పేజీలో

"అలాంటి ఆశలేం పెట్టుకోకు. డెలివరీ కాగానే తీసుకొస్తాను."

"ఇందులో ఆశేముంది? మా అమ్మావాళ్ళు పంపాలి గదా?"

తన ఎడమ చేతిలోకి నా కుడిచేతిని తీసుకొని కుడి చేత్తో నిమురుతోంది. తీయటి స్పర్శ.

స్పర్శ యెన్ని రకాలు!

ప్రేమ, వాంఛ, కోపం—విభిన్న మనః ప్రవృత్తుల సంకేతం స్పర్శ.

కొంచెం ఎత్తయిన పొట్టతో కొత్త కాంతుల్ని తెచ్చుకొని అనంత అందంగా వుంది.

మాతృత్వం యిద్దరు స్త్రీ పురుష ప్రకృతి సహజమైన సంగమ ఫలితమే కావచ్చు. కాని కేవలం ఒక భౌతిక విషయంగా మాత్రమే తీసుకోలేము. అది ఒక అవ్యక్తానుభూతి.

అనంతదగ్గర నుండి 'పాండ్స్' పరిమళాలు ఆగి ఆగి వస్తున్నాయి.

"పాపకేం పేరు పెడదామంటారు!"

"నీకిష్టమైన పేరు."

"పాప పేరు చాల అందంగా వుండాలి. లావణ్య బాగుంది కదూ!"

"చాల పాత పేరు. అయినా పేరులో ఏముంది?ఇవాళ నువ్వు కనవలసింది సుబ్బమ్మలనూ, లావణ్యలను కాదు అనంతా. ఒక పాణిగ్రాహిని. ఒక నిర్మలను కనాలి. ఒక కవి యేమన్నాడో తెలుసా? "ప్రతి తల్లీ ఒక సూర్యున్ని ప్రసవిస్తే చాలూ" అని.

"మన పాపో, బాబో పెరిగి పెద్దవాళ్ళయ్యేంతవరకు మీరు కావాలనుకొనే వర్గాలు లేని సమాజం రాదంటారా?"

"రావాలనే మనం కోరుకుంటాం! వస్తుంది కూడ. మారిన ఆ నూతన సమాజాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం ఎప్పుడూ వుంటుంది. ఆ బాధ్యత వాళ్ళదే గదూ?"

అనంత సుదీర్ఘమైన చర్చల్లోకి ఎప్పుడూ వెళ్ళదు. విషయాల్ని కదిపి వూరుకోవడం తప్ప.

"పుస్తకాలేమైనా తీసుకెడుతున్నావా?"


"చలం ప్రేమ లేఖలు, బిడ్డల శిక్షణ."

"బిడ్డల శిక్షణ సరైన వేళలో సరైన పుస్తకం. ప్రేమలేఖలు ఇప్పుడెందుకు?ఇంకెన్ని సార్లు చదువుతావ్?"

"ప్రేమ లేఖలే కాదు, చలం ప్రతి రచనా నిత్యనూతనమే. ఎన్నిసార్లు చదివినా మొదటి సారి చదివినట్లే వుంటుంది."

ఇక్కడి మౌనం నా వంతు. చలాన్ని అర్థం చేసుకోవడంలో నాకూ అనంతకూ కొన్ని తేడాలున్నాయి. అయినప్పటికీ చలం మా యిద్దరికీ అభిమాన రచయితే.

లూప్ లైన్లో వున్న కంపార్ట్‌మెంట్‌లో



నుంచి నలిగిపోయిన పూలవాసనా, చౌక రకం పౌడర్ వాసనా వుండి వుండి గుప్పుమని మా మీదుగా వెళ్తున్నాయి. ఆ వాసనలు మన ప్రజాస్వామ్యంలా ఎబ్బెట్టుగాను, జుగుప్సాకరంగాను వుండి గబ్బుకొడుతున్నాయి.

మేము కూర్చున్న బెంచీకి కొంచెం దూరంలో చింకి గుడ్డల మధ్య ముసలి బిచ్చగత్తె స్వాతంత్ర్యం ప్రకటించుకున్న తర్వాత భారత దేశంలా మూలుగుతూ ముడుచుకునుంది.

రెండు గంటల లేటుగా వచ్చిన తిరుమల ఎక్స్‌ప్రెస్ కొంచెంసేపు చేపల మార్కెట్‌లా చేసి ప్లాట్‌ఫాంను వదలి వెళ్ళిపోయింది

బెల్ కొట్టారు.

"దయచేసి వినండి."

ఈసారి చెవులు నిక్కబొడుచుకోలేదు.

"మద్రాసు నుండి హైదరాబాద్ వెళ్ళు ఫిఫ్టీ త్రీ ఎక్స్‌ప్రెస్ మరి కొన్ని నిముషములలో నాల్గవ నెంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చుచున్నది—"

అనౌన్సుమెంటు పూర్తికాలేదు. ఫిఫ్టీత్రీ ప్లాట్‌ఫాం పైకి దూసుకొచ్చింది.

ఎన్నికలకు ముందు కొద్ది రోజులూ, అయిన తర్వాత వెంటనే కొద్దిరోజులూ ప్రజల చుట్టూ తిరిగి ఆ తర్వాత కనిపించని రాజకీయ నాయకుల్లా మన రైళ్ళు రెండు స్టేషన్లమధ్య నెమ్మదిగా నడచి స్టేషన్లో మాత్రం పరుగెత్తుతుంటాయి.

అనంతకు కిటికీ ప్రక్కనే సింగిల్ సీటు దొరికింది. తను తెచ్చుకొన్న ఒక్క సూట్‌కేసు తన కాళ్ళదగ్గర పెట్టుకుంది.

"శనివారం వస్తారుగా! తప్పక రావాలి. రెండురోజుల కొక లెటరయినా రాయాలి. ఆరోగ్యం జాగ్రత్త. హోటల్ తిండి తినకండి. అత్తయ్యను పిలిపించండి."

"ఇక ఆపు తల్లీ! అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాను. నువ్వు జాగ్రత్త. మామయ్య స్టేషన్ కొస్తార్లే. లెటర్స్ రాయడం మర్చిపోకేం. ఆరోగ్యం జాగ్రత్త."

"ఇక ఆపు తండ్రీ! అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాను,"

ఇద్దరం నవ్వుకున్నాం.

గార్డు విజిలేసాడు.

పచ్చలైటు వూగుతుంది.

"బిబ్బూ"—అవ్యక్తానుభూతుల అంచుల చివరకి వెళ్తేనే అనంత అలా 'బుజ్జీ'ని తిరగేసి పిలుస్తుంది.

"ఏమిటోయ్?"

"బిబ్బూ! రియల్లీ ఐ లవ్ యు; ప్లీజ్ రిమెంబర్ మి."

"ఏమిటీ? రియల్లీ అని ఇంత తొందరగానా చెప్తున్నావ్."

అనంత గొంతులో దుఃఖం.

అనంత కళ్ళలో దుఃఖం.

"ఏమిటి చిన్నపిల్లలా? ఇప్పుడేమైందని?" అనాలనుకున్నాను. కాని మాట గొంతు చించుకొని రావడంలేదు.

అనంత నా చేతిని తన పెదాలతో చిన్నగా 'టచ్' చేసి వదిలింది. ట్రైన్ కదిలింది. బయట గాలిలో ఎర్ర గాజులతో అనంత తెల్లని చేయి వూగుతోంది.

నా చూపులే ఆమెకు వీడ్కోలు చెప్పాయి.

* * *

స్టేషన్ బయటికొచ్చాను. టైం రెండూ ముప్పావు కావొస్తోంది. ఈమధ్య డే అండ్ నైట్ టీ స్టాల్స్ వూళ్ళో బాగా పెరిగాయి. ఒకసారే కాఫీ తాగి పోవచ్చు అనుకొంటూ టీ స్టాల్ లోపలి కెళ్ళాను. టేబుల్ ముందు కూర్చున్నాను. లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. టేబుల్ మీదున్న ఈవెనింగ్ ఎడిషన్ న్యూస్ పేపరు తీసుకొన్నాను.

చీకటిరాజ్యంలో దుర్మార్గపు రాజకీయాలు పేపరు నిండా. అత్యవసర పరిస్థితి పెట్టిన తరువాత పిల్లలు సరిగ్గా టైముకు వస్తున్నారట. సిగ్గులేకపోతే సరి. పిల్లలు సరిగ్గా స్కూలుకు రావడానికి యెమర్జెన్సీ అవసరమైన దేశం మనది.

"అరేయ్ చంద్రా!"

పేపర్లోంచి ముఖం బయటకు తీసాను.

నా ఎదురు కుర్చీల్లో యిద్దరు యువకులు. ఎక్కడో చూసిన గుర్తు. చెవులమీదుగా గడ్డం క్రిందుగా మఫ్లర్ చుట్టుకున్నారు. కొంచెం పెరిగిన గడ్డం, దట్టంగా మీసాలు. మీసాల మధ్య చిరునవ్వు.

అవును! ఆ నవ్వు రామసూరి. రామసూరి. అవును రామసూరే. మరి—అతను—కొనదేరిన ముక్కు, గంభీరమైన కళ్ళు—ఇంకెవరివి? అంజిరెడ్డివే.

నా ఆనందం అవధులు దాటుతోంది.

వాళ్ళను చూసి దాదాపు తొమ్మిదేళ్ళవుతోంది.

"ఏమిటిరా గుర్తు పట్టలేదా! నేను రామసూరిని. వీడు అంజిరెడ్డి."

"బావున్నార్రా?" అన్నాను.

"ఏం చేస్తున్నార్రా?" అనబోయి మానేసాను.

వాళ్ళేం చేస్తున్నారో నాకు తెలుసు.

అటువంటి వాళ్ళేం చేస్తారో కూడా నాకు తెలుసు.

నా ఆలోచనలకు పదేళ్ళ వయస్సు తగ్గింది.

మా వూరు పల్లెటూరే అయినా ఒక హైస్కూలుంది.

మా స్కూలుకు చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా విద్యార్థులు వస్తుండేవాళ్ళు. మొత్తం ఆరువందలదాకా వుండేవాళ్ళం. మాది కమిటీ స్కూలు. రామసూరి, అంజిరెడ్డి ఎస్సెల్సీ నేను ఫెన్తూ చదువుతున్నాం. మా వూరిమీదా, స్కూలుమీదా మా గ్రామ భూస్వాములదే పెత్తనం. మా స్కూలు హెడ్‌మాస్టారు, మిగతా టీచర్లందరూ దాదాపు ఆ కుటుంబాల వారే. మా గ్రామ పెత్తందార్లందరూ పాలక వర్గ రాజకీయ పార్టీ అనుచరులే. ఒకే ఒక వ్యక్తి తప్ప. ఆ ఒక్క వ్యక్తి రామసూరి నాన్న. రామసూరి నాన్నను మా వూళ్ళో అంతా 'కమ్యూనిస్టు ప్రకాశరావు" అని పిలుస్తారు. ఎన్నికల్లో తప్ప కమ్యూనిస్టు రాజకీయ సంచలనం మా వూళ్ళో దాదాపు కనిపించేది కాదు.

రామసూరి నాన్న రామసూరికోసం మంచి మంచి పుస్తకాలు, సోవియట్ పిల్లల పుస్తకాలూ, నార్ల చిరంజీవి బాలసాహిత్యం తెస్తుండేవాడు. ఎవరింటిలోనూ లేనన్ని పుస్తకాలు వుంటుండేవి వాళ్ళింట్లో. రామసూరి తను చదువుతూ ఇతర్ల చేత చదివించాలని ప్రయత్నించేవాడు. "కమ్యూనిస్టు సూరి" "కమ్యూనిస్టు పుస్తకాలు" అంటూ యెవరూ చదివేవారు కాదు.

రామసూరి స్కూల్ డిబేట్సులోను, మోడల్ పార్లమెంటులోను చురుగ్గా పాల్గొనేవాడు. మా స్కూల్‌లో ప్రతి శుక్రవారం ఈవెనింగ్ లాస్ట్ పిరియడ్ డిబేట్ గాని, పార్లమెంటు గాని వుండేది.

ఒకరోజు "భారతదేశంలో ప్రజాస్వామ్యం"

గురించి డిబేటు జరుగుతుంది. ఆ రోజు సూరి ఆ విషయమై మాట్లాడుతూ "ఉత్పత్తి సాధనాలమీద ప్రజలకు అధికారం వుండటమే నిజమైన ప్రజాస్వామ్యమని, వ్యక్తిగత ఆస్తి రద్దు కాకుండా ప్రజలందరూ సమానహక్కులతోనూ' నిజమైన స్వేచ్ఛతోను బ్రతకడం సాధ్యంకాదని మన దేశంలో చలామణి అవుతున్న ప్రజాస్వామ్యం పాక్షికమైనదని" చెప్పాడు. ఈ చర్యకు అధ్యక్షత వహించిన మా తెలుగు మాస్టారు సుబ్బారెడ్డిగారు సూరిని ఎగతాళి చేస్తూ మాట్లాడారు. ఆయన తన ఉపన్యాసంలో "సూరి చెప్తున్నది రష్యా కమ్యునిజం గురించి. వాళ్ళు సమానత్వం సమానత్వం అని గొడవ చేస్తారు. సమానత్వమంటే వాళ్ళ ఉద్దేశంలో ఏమిటి? రష్యాలో యేం జరుగుతుంది. ఇవాళ చైనాలోం ఏం జరుగుతుంది, ఉదాహరణకు సూరి పొట్టివాడు. అతని స్నేహితుడు అంజిరెడ్డి పొడవుగా వుంటాడు. రష్యాలోనో, చైనాలోనో అయితే సూరి ఎత్తుతో సమానంగా అంజిరెడ్డి తల నరికేస్తారు. అవును హెచ్చు తగ్గులు వుండనివ్వరు వాళ్ళు. సొంత ఆస్థి వుండకూడదు. సొంత పెళ్ళాం ఉండకూడదు. నీ పెళ్ళాం నా పెళ్ళాం అని తేడా వుండదు. నా పెళ్ళాం అందరి పెళ్ళాం అవుతుంది. కనుక అది మన దేశానికి పనికిరాదు. మనకు గాంధీ, నెహ్రూ...." మాస్టారి ఉపన్యాసం పూర్తి కాలేదు. రామసూరి స్టేజిమీదికి పరుగెత్తాడు.

"తెలుగుమాస్టారిలాంటి కమ్యూనిస్టు వ్యతిరేకులు కమ్యునిజానికి ఇలాంటి వక్రభాష్యాలు చెప్పడం కొత్తేమీ కాదు, రాజకీయ అవగాహన స్పష్టంగా లేని, అర్థం చేసుకొనే స్థితిలో లేని విద్యార్థుల్లో యిలా కమ్యూనిస్టు వ్యతిరేకత రెచ్చగొట్టడం దుర్మార్గమైన చర్య" అని, పెద్దగా ఉద్రేకంగా మాట్లాడాడు.

ఆ తరువాత క్లాసులో యేదో నెపం పెట్టి రామసూరిని తెలుగుమాస్టారు పిచ్చి కొట్టుడు కొట్టారు.

రామసూరి భూస్వాముల బిడ్డలతో కాక మిగతావాళ్ళతో స్నేహం చేసేవాడు. వాళ్ళు కూడా అతని రాజకీయాలతో తప్ప అతనితో స్నేహంగా వుండేవారు. వాళ్ళు యెక్కువ భాగం సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో వుంటుంటారు. హాస్టలు తిండి, అక్కడి అధ్వాన్న పరిస్థితులలను పరిశీలించి ఆ విద్యార్థులతో చర్చించేవాడు. ఇతని అభిప్రాయాలతో ఏకీభవించినా పరిస్థితుల మార్పుకోసం కృషి చేసే వాళ్ళు కాదు.

రామసూరి, అంజిరెడ్డి మంచి స్నేహితులు. నేను కూడా రామసూరితో కలిసి తిరుగుతూ అతనివద్ద నున్న పుస్తకాలు చదువుతూ దగ్గర వాణ్ణయ్యాను.

మా వూరు పొగాకు పంటకు ప్రసిద్ధి. కొన్ని వందలమంది కూలీలు పొగాకు బ్యారన్లలోను, పొగాకు కంపెనీలోను పని చేస్తుంటారు. ముఠా కార్మిక సంఘం పెట్టాలని సూరి ప్రయత్నించాడుగాని అది సాధ్యపడలేదు.

చేనేత కార్మికులు జరిపే భావనారుషి పండుగకు యువకులందరినీ ఒకచోట చేర్చి ప్రతీ యేడూ వుండే రికార్డు డ్యాన్సులకు బదులు ఒక సాంఘిక నాటిక ప్రదర్శింప చేయడం కుల పెద్దలకూ, ఊరి పెద్దలకూ గిట్టలేదు.


రామసూరి వాళ్ళ నాన్నవల్ల లేని ప్రమాదాన్ని తీసుకొస్తున్నాడు.

ఇదే సమయంలో ఎస్సెల్సీ పబ్లిక్ పరీక్షలొచ్చాయి.

నైన్త్, టెన్తు, ఎస్సెల్సీ మూడు సంవత్సరాలు చదివిన సైన్సూ హిందీ పరీక్షలు ఒకే రోజు జరిగేవి. దీనికి వ్యతిరేకంగా అన్ని స్కూలు విద్యార్థులు సమ్మె చేస్తున్నారు.

రామసూరి మన స్కూల్లో కూడా చేయించాలన్నాడు. విద్యార్థులతో మాట్లాడితే కొందరు అవునని కొందరు కాదనీ అన్నారు. మనం సమ్మె చేయించలేకపోయినా కనీసం మన అసంతృప్తిని, మన కోర్కెల్ని ప్రజలకు చెప్పాలి. డిమాండ్స్ గోడలమీద రాద్దాం అన్నాడు.

ఇది మాకు ఒక కొత్త అనుభవం. నేను, సూరి, అంజిరెడ్డి, శివప్పిరెడ్డి గోడలమీద నినాదాలు, డిమాండ్స్ రాయాలని నిర్ణయించు




కొన్నాం. చిన్న చిన్న డబ్బాల్లో కాకిరాయి రంగు కలుపుకొన్నాం. ఈతపుల్లలు నమిలి బ్రష్‌లు తయారుచేశాం.

రాత్రి పదిన్నరకే మా వూరు నిదుర పోయింది.

రామసూరి యింటి దగ్గరనుండి మేము బయలుదేరాం.

డబ్బాలో కుంచెలు మునుగుతున్నాయ్.

గోడల మీద అక్షరాల్లా తయారవుతున్నాయ్.

తెల్లని గోడమీద ఎర్రటి అక్షరాలు.

పచ్చని చెట్టుకి ఎర్రని మందారాలు.

"ఎస్. ఎస్. యల్. సి. పబ్లిక్ పరీక్షల్లో రోజుకొక పరీక్ష మాత్రమే పెట్టాలి."

"కొఠారి కమీషన్ సిఫార్సులు అమలు చేయాలి."

"లేబొరేటరీ వసతులు కల్పించాలి."

"హాస్టలు గ్రాంటు పెంచాలి."

"హాస్టల్లో అధ్వాన్నపు పరిస్థితులు నశించాలి."

"ఫీజులు తగ్గించాలి."

రంగులో మునుగుతున్న కుంచెలు
గోడమీద నినాదాలు
నినాదాలు కావవి
మా చైతన్య పరిమళాలు
ఊరు తెల్లవారింది
తూర్పు ఎర్రబడింది
మా స్కూలు గోడ ఎర్రబడింది.
మా వూరి గోడల నిండా ఎరుపు
మా వూరి కామందుల కళ్ళ నిండా మెరుపు.

"ఎరుపంటే కొందరికి (కామందులకి) భయం భయం."

"పసిపిల్లలు (మేము) వారికన్న నయం నయం."

మరునాడు మేము మామూలుగా స్కూలుకు వెళ్ళాం.

మా హెడ్మాస్టారు, ప్రసాదరెడ్డిగారు, సుబ్బారెడ్డిగారు మా ఐదుగురిని ఒక గదిలోకి పిలిచి లోపల గడియపెట్టారు.

మొదట ఎగతాళి చేశారు. తరువాత ప్రశ్నల వర్షం కురిపించారు. మా సమాధానాలు నచ్చలే

దన్నారు. మాకు రెటమతం ఎక్కువన్నారు. పొగరు బాగా ఎక్కిందన్నారు.మా వూరి పరువు, మా స్కూలు 'గుడ్ నేమూ' గంగలో కలిసా యన్నారు. ఇలా వదిలితే మేము వాళ్ళ కొంప ముంచుతామన్నారు. చివరికి మా అందరికీ తలా నాలుగంటించి బయటకు పంపారు.

"హెడ్‌మాస్టర్ దురాగతం" పేరుతో ఈ సంఘటనను రామసూరి యింటికి వచ్చే ఒక పత్రిక మోసుకొచ్చింది.

ఎస్సెల్సీ విద్యార్థులు తమ కోర్కెల్ని సాధించారు.

దీనితో రామసూరి మాట వినడం ప్రారంభ మైంది. రామసూరి, అంజిరెడ్డి మా గ్రామ రాజ కీయాల్లో ప్రముఖ పాత్ర వహించి, యువజన సంఘాలు, కూలి సంఘాలు అని యేర్పాటు చేశారు.

ఎస్సెల్సీ అయిపోగానే రామసూరి, అంజి రెడ్డి పి. యు. సి. కోసం టౌను వెళ్ళడం, అక్కడ స్టూ డెంట్ ఫెడరేషన్‌లో పని చేయడం, ఇంతలో నక్సల్‌బరీలో వీచిన గాలి శ్రీకాకుళం, గోదావరి జిల్లాల్లోకి జొరబడటం, ఆ విప్లవ రాజకీయాల్లో పని చేస్తూ అజ్ఞాత వాసంలోకి వెళ్ళడం—ఇలా ప్రజలకోసం పాటుపడే క్రమంలో వాళ్ళు.

డిగ్రీ పూర్తిచేయడం, ఉద్యోగం దొరకక్క పోవడం, అనంతతో పరిచయం ఆ తరువాత పెళ్ళి కావడం, నేను పైపు ఇన్‌స్టూట్ పెట్టు కోవడం, అనంత హైస్కూల్లో తెలుగు టీచరుగా పని చేస్తూండడం, పుస్తకాలు చదవడం—విషయాలు తెలుసుకోవడం, ఏవో కవితలూ, కథలూ రాయడం — ఈ పరిధి దాటని జీవితం సాగిస్తూ నేను.

"మీ అమ్మా నాన్నా బావున్నారా? మీ చెల్లెలి పెళ్ళి చేశారా?"

—అప్పుల్లా కుటుంబ క్షేమ సమా చారం.

నిజమైన చుట్టాలు మరింకెవరు?

నేను సమాధానాలు చెప్పాను.

"పత్రికల్లో నీ రచనలు చూస్తున్నాను. నీలో వ్యక్తివాదం, ఆత్మాశ్రయవాదం పూర్తిగా పోలేదు."

"నేనేమీ ప్రజలకు వ్యతిరేకంగా రాయడం లేదు కదా? అయినా భావాలన్నీ ఆత్మాశ్రయాలే కదా?"

"ప్రజలకు వ్యతిరేకంగా వ్రాయకపోవడం ఒక్కటే చాలదు. వ్రాయగల శక్తి, ఆ స్వభా వము వున్నప్పుడు ప్రజల గురించి వ్రాయక పోవడం కూడా తప్పే. భావాలన్నీ ఆత్మాశ్రయా లని అంటున్నావు నువ్వు. కాని యిది కొత్త వాదనేమీ కాదు. ఇది కాలం చెల్లిన సూత్రీ కరణ. ఆలోచనలు, భావాలు, ఆనాటి సామా జిక వ్యవస్థలో వున్న ప్రజల జీవన పరిస్థితు లను ఆశ్రయించుకొని వుంటాయి. ఆ భావ ప్రకటనా రూపాలే సాహిత్యము, కళలు. దీనర్థం సాహిత్యమూ, కళలు ప్రజల జీవితా ల్లోంచి పుట్టుకొస్తాయని.

ప్రజల జీవితం, ప్రజల పరిస్థితులు, వాటి కారణాలు, వాటిని మార్చడానికి ప్రజలు చేసే ప్రయత్నాలు—అన్నీ అధ్యయనం చేయాలి. ప్రజలు ఆ పరిస్థితులు మార్చుకోవడానికి కావా ల్సిన చైతన్యం కలిగించడం, ఆ ప్రయత్నాలకు ఊపిరి పోయడం, ఆ ప్రయత్నాల విజయాలను నిలబెట్టుకొనే శక్తిని వారికివ్వడం—ఇవే నేటి దశలో సాహిత్యం, కళలు యొక్క ప్రయో జనం."

రామసూరి ఒక వ్యక్తి కాడు

రామసూరి ఒక పాఠశాల

రామసూరి ఒక మంచి పుస్తకం.

రామసూరి మాట్లాడని విషయం లేదు. రామసూరి సంచిలో నుండి యేవో తీసాడు. తీసి నా కిచ్చాడు. నా కిచ్చి చదవమన్నాడు.


కరపత్రాలు; సైక్లోస్టయిల్ చేసిన పత్రికలు.

అత నెక్కడుంటే అక్కడ విప్లవం

అత నెక్కడుంటే అక్కడ చైతన్య భాండాగారం.

మూడు కాఫీ లొచ్చినయ్.

కరపత్రాలు, పత్రికలు జేబులోకి నెట్టాను.




ఫలితం పక్క పేజీలో

కాఫీ త్రాగడం పూర్తిచేసి కప్ టేబులు మీద పెట్టి తల పైకెత్తాను.

రామసూరి, అంజిరెడ్డికి రెండువైపులా—వెనుక పోలీసులు.

నా ముఖంలో షాక్ కనిపించిందేమో సూరి వెనక్కి తిరిగాడు. తన చుట్టూ పోలీసులు. పరిస్థితి అర్థమైంది.

రామసూరి, అంజిరెడ్డి నిల్చున్నారు.

రామసూరి పిడికిలి ఎత్తి పెట్టాడు.


"ప్రియమైన ప్రజలారా! కామ్రేడ్స్."

అక్కడున్న పాతికమంది అంతకు ముందు నుంచీ యిటే చూస్తున్నారు.

"నా పేరు రామసూరి. ఈ కామ్రేడ్ పేరు అంజిరెడ్డి. మేము కమ్యూనిస్టు విప్లవకారులం. మన దేశాన్ని రెండువందల సంవత్సలపాటు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పాలించారు. 1947 అగస్టు 15 అర్ధరాత్రి అధికార మార్పిడి తతంగం జరిగింది. దాన్నే మనం "స్వాతంత్ర్యం" అని ప్రకటించుకొన్నాం. స్వాతంత్ర్యం గురించి ప్రజలు కన్న కలలు కలలుగానే మిగిలిపోయాయి. ఉత్పత్తి సాధనాలు ప్రజల చేతుల్లోకి రాలేదు. మనది వ్యవసాయక దేశం. ప్రధానమైన వుత్పత్తి సాధనం భూమి. ఆ భూమిని అతి కొద్దిమంది భూస్వాములు తమ చేతుల్లో వుంచుకొని, వీరే పాలక వర్గంగా తయారయ్యారు. 1947కు ముందు ఒక బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీకి మాత్రమే గురయిన మనం ఈ రోజు ప్రపంచంలోని అన్ని సామ్రాజ్యవాద దేశాల, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల దోపిడీకి గురవుతున్నాం. ఆర్థిక, రాజకీయ, మిలటరీ, సాంస్కృతిక రంగా లన్నిటిమీదా విదేశీ సామ్రాజ్యవాదుల, సోషల్ సామ్రాజ్యవాదుల పెత్తనం బలంగా వుంది. అందుకనే మేము ఈ సామాజిక వ్యవస్థను "అర్ధవలస, అర్ధఫ్యూడల్ స్వభావం కలిగిన వ్యవస్థ" అని అంటున్నాం.

ఈ దేశంలో భూస్వామ్య వ్యవస్థ నిర్మూలించబడి, ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమి ప్రజల పరం కావడం ద్వారాను, విదేశీ జోక్యాన్ని, వారి పెట్టుబడులను, వారి పెత్తనాలను అన్ని రంగాల నుంచి ఎత్తివేయడం ద్వారాను భారత ప్రజలు దోపిడీనుండి విముక్తి సాధించగలరని మా విశ్వాసం.

"ప్రస్తుత దశలో శ్రామికవర్గ నాయకత్వాన కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా మధ్యతరగతి ప్రజలు, జాతీయ బూర్జువా వర్గంతో ఐక్య సంఘటన యేర్పాటు చేసుకొని సాగే జనతా ప్రజాతంత్ర విప్లవ" మొక్కటే ఈ కర్తవ్యా




లను నిర్వర్తించగలదు. ఈ కర్తవ్య నిర్వహణకు ప్రజలను సిద్ధం చేయడమే మా కార్యక్రమం.

ఈ కార్యక్రమంలో భాగంగానే మేము ఏజెన్సీ ప్రాంతాల్లో రైతు కూలి సంఘాలను పెట్టాము. వారి స్థానికసమస్యలమీద వారిని కదిలించి వారికి పోరాట చైతన్యం కలిగించడమే మేము చేస్తున్న కృషి.

"చట్టబద్ధమైన ప్రభుత్వాన్ని సాయుధ పోరాటం ద్వారా కూలద్రోయాలని మేము కుట్ర పన్నామని, మామీద కుట్రకేసు బనాయించింది ప్రభుత్వం. దోపిడీలతోను, హత్యలతోను మాకు సంబంధాలున్నాయని ఆరోపణలు చేసింది. ఇంటా బయట అత్యవసర పరిస్థితి ప్రకటించి నామ మాత్రమైన ప్రజాస్వామ్య హక్కులను సైతం కాలరాసి తన నియంతృత్వాన్ని, నిర్బంధాన్ని ప్రజలమీద ప్రయోగిస్తుంది. ఎంత నిర్బంధం ప్రయోగించినా అంతిమ విజయం ప్రబలదేనని ప్రజలు జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తిచేసి సోషలిస్టు విప్లవానికి పునాది వేయగలరని మా గాఢ విశ్వాసం. ఈ రోజు మీ అందరి ముందే అరెస్టు చేస్తున్న వీళ్ళు విచారణ లేకుండా యేళ్ళపాటు జైల్లో వుంచవచ్చు. నానా చిత్రహింసలపాలు చేయవచ్చు. ఎదురు కాల్పుల్లో చనిపోయామని ప్రకటించవచ్చు. మేము పోయినా పోరాటం ఆగదు. అంతిమ విజయం ప్రజలదే. ప్రజలే చరిత్ర నిర్మాతలు."

పీలగావుండే రామసూరి కంఠంలో ఎక్కడిదీ గాంభీర్యం?

ఈ శక్తి ఎక్కడి నుండి వచ్చింది?

ఈసారి అంజిరెడ్డి పిడికిలి ఎత్తాడు.

"విప్లవం."

"వర్ధిల్లాలి"—రామసూరి గొంతు అందుకుంది.

"కమ్యూనిష్టు విప్లవకారులు."

"వర్ధిల్లాలి."

ఇదేమిటి? వీళ్ళు వ్యక్తుల పేర జేజేలు కొట్టడంలేదు.

నా చిన్నతనంలో నినాదాలన్నీ వ్యక్తులకు జేజేలు కొట్టడంతోనే పూర్తయ్యేవి.

"ప్రజా ఉద్యమాలమీద నిర్బంధకాండ"

"నశించాలి."

హోరు—హోరు—నినాదాల హోరు.

"కమ్యూనిస్టులం మేము కష్టజీవులం."

.................

పాట సాగుతుంది.

"అరచేతిని అడ్డు పెట్టి సూర్యకాంతి
నాపలేరు.
అరెస్టులను సాగించి ప్రజా శక్తి నడ్డ
లేరు."

పాణిగ్రాహి పాట రామసూరి, అంజిరెడ్డి గొంతుల్లోంచి ప్రపంచంలోకి—

పాట పాడే గొంతుల్ని పోలీసులు తీసుకెళ్ళి పోతున్నారు.

పాట వారి వెంట సాగిపోతుంది.

వాళ్ళు కనుచూపు దాటిపోయారు.

ఆ పాట గాలిలో కలిసి యిటువైపింకా వస్తూనే వుంది.

జనంలో గుసగుసలు

"ఎవరు వాళ్ళు? ఎవరు వాళ్ళు?"—అని.

కాని—

"ఎవరి వాళ్ళు? ఎవరి వాళ్ళు?"—అని అనరేం?

* * *

ఆ రోజు ఆదివారం. ఆలస్యంగా నిద్ర లేచాను.

ప్రక్కనే టీపాయ్‌మీద ఉత్తరం.

అనంత దగ్గరనుండి వచ్చిన ఉత్తరం.

తన ఆరోగ్యం బాగానే వుందని, నన్ను శనివారం రమ్మని మంగళవారం పోస్టుచేసిన ఉత్తరం.

నాకు శనివారం అందిన ఉత్తరం.

పేపర్‌బోయ్ పడేసిన పేపరు కిటికీలోంచి పరుగెత్తుకొచ్చింది.

మంచంమీద పడుకొనే పేపరు తిప్పుతున్నా.

అత్యవసర పరిస్థితి సాధించిన నూరు విజయాలతో పేపరు నిండిపోయింది.

ఐదో పేజీ చివర్లో—

"ఎదురు కాల్పుల్లో యిద్దరు
నక్సలైట్ల మృతి."

"....ఏజెన్సీ ప్రాంతంలో మొన్న రాత్రి నక్సలైట్లకు పోలీసులకు జరిగిన సంఘర్షణలో ప్రముఖ నక్సలైటు సూరన్న అనబడే రామసూరి; అతని అనుచరుడు దాసు అనబడే అంజిరెడ్డి చనిపోయినట్లు, మరి నలుగురు తప్పించుకుపోయినట్లు. వీరి వద్ద రెండు నాటు తుపాకులు, నక్సలైటు సాహిత్యం, చేతిబాంబులు దొరికినట్లు యిక్కడ కందిన సమాచారంవల్ల తెలుస్తుంది."

రామసూరి అంజిరెడ్డి యిక కనిపించరు.

నా గుండెనిండా నిశ్శబ్ద విషాదం.

కంటినుండి చెవులమీదుగా నా జుట్టులోకి వెచ్చగా జారుతున్న దుఃఖం.

ఈ రోజు మూడు రంగుల జండా క్రిందకు దిగదు.

పత్రికలు సంపాదకీయాలు రాయవు.

రేడియోలో విషాద సంగీతం వినబడదు.

కాని

నాకు తెలుసు

అక్కడ—అడవి ఎరుపెక్కుతుంది. నేల ఎరుపెక్కుతుంది. అడవి పూలు ఎరుపెక్కుతాయి—కొండలూ కోనలూ యెరుపెక్కుతాయి. రామసూరి, అంజిరెడ్డి గొంతులతో "విప్లవం వర్ధిల్లాలని" ఆ అడవీ, ఆ కొండలూ ప్రతిధ్వనిస్తూనే వుంటాయి.

ఎప్పుడో, ఎక్కడో విన్న పాట అస్పష్టంగా గుర్తుకొస్తుంది.

"ఎవరు వాళ్ళు
ఎవరు వాళ్ళు
ఎవరి వాళ్ళు
ఎవరి వాళ్ళు
ఎవరికోసం వచ్చినారు
ఎవరికోసం పోయినారు."

కళ్ళు తుడుచుకొంటూ లేచి బ్యాగులో రెండు జతలు బట్టలు సర్దుకొన్నాను అనంత దగ్గరకైనా వెళ్దామని. □